# డయాస్పోరా కథల విశ్లేషణ నిర్వచించిన డయాస్పోరా కథ

- నిర్మలాదిత్య

నేపథ్యం*:*

నేను రాసిన డయాస్పోరా కథలగురించి, వాటిలో ఉపయోగించిన కేమియో పాత్రలు, ఎంచుకున్న కథా శిల్పం గురించి అప్పుడప్పుడు సభలలో చర్చించడం చేస్తున్నా, డయాస్పోరా కథల మీదే మాట్లాడింది, వ్యాస రూపంలో ఇదివరకు రాసింది మూడు సార్లే.

"డయాస్పోరా కథల - పరిణామాలు" అన్న వ్యాసం 2019 లో రాయడం మొదటిది. 1995 లో పెమ్మరాజు వేణు గోపాల రావు గారు, అమెరికా తెలుగు కథల తొలి సంకలనం లో, ప్రతిపాదించిన విధంగా ఆంతరిక సమస్యలు , మరపురాని మన దేశం, కొత్త అనుభవాలు, కేవలం కల్పితం అని, కథలను నాలుగు తరగతుల లాగా చూడ గలిగితే, కాల క్రమేణా 1995-2012 వరకు వచ్చిన కథల లో, ఆ నాలుగు తరగతుల నిష్పత్తిలో ని మార్పులను విశ్లేషించాను. ఇది సంఖ్యా పరమైన విశ్లేషణ మాత్రమే.

2021 లో "కథలు కన్న అమెరికా జీవితాలు" అన్న అంశం పై రెండో వ్యాసం రాయడం, చదవడం జరిగింది. అమెరికా కథలలో ఎలాంటి పాత్రలు, జీవితాంశాలు చోటు చేసుకుంటున్నాయి? ఇక్కడ జీవిస్తున్న వారి సమస్యలు ఏమిటీ? వారి పరిష్కారం కథలలో వస్తున్నాయా? అలానే ఏ విషయాలపై ఈ తెలుగు కథానికలు ఎక్కువగా మక్కువ చూపెట్టడము లేదు. మంచి సాహిత్యం రావడానికి కొత్త కథా వస్తువులు ఉన్నాయా? అన్న ప్రశ్నలకు సమాధానాలు ఈ వ్యాసంలో పంచుకున్నాను.

2022 లో "అమెరికాకు వలస వచ్చిన భాషల ప్రగతి" అన్న అంశం పై ఒక వ్యాసం రాసాను. అమెరికాలో తెలుగు కథల ప్రగతి ముందు, ముందు ఎలా ఉండబోతుంది? ఎలాంటి పరిస్థితులు, అందండలు, కథల, సాహిత్య వికాసానికి తోడు పడతాయి? ఇలాంటి కొన్ని ప్రశ్నలకు సమాధానం వెదికే ప్రయత్నమే, ఈ వ్యాసం. ఇది వరకే అమెరికాకు వలస వచ్చిన ఇంగ్లీష్, స్పానిష్, ఫ్రెంచ్ భాషల చరిత్రలను ఆ వ్యాసంలో విశ్లేషించి, ఆ చరిత్ర చెప్పిన పాఠాలు మన తెలుగు భాషకు ఎలా వర్తిస్తాయి, దాని వల్ల తెలుగు భాషా ప్రియులు చేయ వలసిన తర్వాతి కార్యక్రమాల గురించి చర్చించడం జరిగింది.

డయాస్పోరా కథల పూర్వం, వర్తమానం, భవిష్యత్తు అని మూడు కాలాల దృక్పథం తో విశ్లేషణ చూస్తే, నా మొదటి రెండు వ్యాసాలు 1990, 2000 దశాబ్దాల లో వచ్చిన గత కాలపు కథలను పరిశీలిస్తాయి.

నేను రాసిన మూడో వ్యాసం(అమెరికాకు వలస వచ్చిన భాషల ప్రగతి) తెలుగు భాష, తెలుగు కథల భవిష్యత్తు గురించి రాసిన ఆలోచనలు.

ఆ సీరీస్ లోనే రాస్తున్న నాలుగో వ్యాసం ఇది. ఈ వ్యాసం కోసం వంగూరి వారు 2022 లో ప్రచురించిన 17 వ డయాస్పోరా కథల సంపుటి ఎన్నుకోవడం జరిగింది. ఇప్పుడు రాస్తున్న వ్యాసం 2022 కథల గురించి కాబట్టి, వర్తమానంగా తీసుకోవచ్చు.

విశ్లేషణ*:*

2022 లో ప్రచురించిన డయాస్పోరా కథల సంపుటిలో 46 కథలు ఉన్నాయి. డయాస్పోరా కథలు ఎక్కువగా వెబ్ జైన్ లలోనే వస్తాయి. అలా నెలకు ఒక 20 కథలు ఈ పత్రికలలో వస్తాయి అంటే, సంవత్సరానికి దాదాపు 240 కథలు ప్రచురింపబడుతున్నాయి అన్న మాట. వాటిలో 46 కథలు వంగూరి వారి వార్షిక కథా సంకలనంలో చోటు

చేసుకున్నాయి అంటే, ఈ కథా సంకలనం డయాస్పోరా కథలకు ప్రతీక అనడంలో ఏ మాత్రం సందేహంలేదు. అందుకే ప్రస్తుత వ్యాసానికి ఈ సంకలనం ఆధారంగా ఎన్ను కున్నాను.

ఈ విశ్లేషణకు కొలబద్ద కూడా ఉండడం అవసరం అనిపించింది. అలా కొలబద్దల గా నాకు రెండు ప్రమాణాలు దొరికాయి. కర్ట్ వొన్నేగాట్ ప్రతిపాదించిన కథా చిత్రాలు (స్టోరీ షేప్స్) , చిన వీరభద్రుడు సేకరించిన "వందేళ్ల తెలుగు కథలు". అలానే కొందరు లబ్దప్రతిష్ట తెలుగు రచయితలతో కూడా నా విశ్లేషణ చర్చించాను. వీరందరూ 30 ఏళ్ల పైనే తెలుగు కథలు రాసిన అనుభవమున్న సాహితీ కర్షకులు.

సంఖ్యా పరంగా విశ్లేషణ చేస్తే, ఈ సంకలనంలో 24 కథలు అమెరికా సంయుక్త రాష్ట్రాల నేపథ్యంలో రాసినవి. మిగిలినవి ఇండియా(5 కథలు), కెనడా(4 కథలు), ఆస్ట్రేలియా(2 కథలు), మలేషియా(1 కథ), సింగపూర్ (1 కథ), శ్రీలంక(1 కథ), ఇంగ్లాండ్ A (1 కథ), ఐర్లాండ్(1 కథ), ఆఫ్రికా (1 కథ), దక్షిణ అమెరికా(1 కథ) నేపథ్యంగా రాసినవి. ఒక నాలుగు కథలు ఒక దేశం అంటూ అవసరం లేని కథలు. మానసిక, ఫాంటసీ ఆధారంగా రాసిన ఈ కథలు ఏ దేశములో ఉన్నా రాయవచ్చు, ఎక్కడి వారికైనా వర్తిస్తుంది.

భారత దేశంలో కాక విదేశాలలో నివసిస్తున్న ప్రవాస భారతీయులు రాసేవన్నీ డయాస్పోరా కథలు అంటే ఈ విశ్లేషణలు అవసరం లేదు. రెండో, ఇంకా ఎక్కువ దేశాలలో కొన్ని సంవత్సరాలు జీవించి, రెండు దేశాల సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను అర్థం చేసుకొని, అందులో నుంచి ఉద్భవించే సంఘర్షణల నేపథ్యంతో రాసిన కథలే డయాస్పోరా కథలని నా అభిప్రాయం.

అలా వేరు వేరు దేశాల నేపథ్యంలో రాసిన కథలలో కూడా భారత దేశం గురించిన ప్రస్తావన ఒక 17 కథలలో కనిపిస్తుంది. గతంలో కథ చదవగానే నాస్టాల్జియా కథ అని తెలిసిపోయేది. అలాంటి కథలు ఇప్పుడు తక్కువ. ఇప్పటి కథలలో కొన్నిటిలో నాస్టాల్జియా ఛాయలు కనిపిస్తాయి. అలాంటి కథల నిష్పత్తి ఇంకా మూడో వంతు, ఇది వరకటి లాగే, ఉండడం గమనార్హం.

కథా రచయిత మీద తను పుట్టిన ప్రదేశాల ప్రభావం ఉండడం సహజం అన్నారు నేను చర్చించిన సాహితీ మిత్రులు. దానికి ఉదాహరణగా కేతు విశ్వనాథ రెడ్డి గారి రచనలు తీసుకోవచ్చు. తెలంగాణలో స్థిర పడిన, రాయలసీమ నేపథ్యంగా గొప్ప కథలు, నవలు రాసారు. ఇది నూటికి నూరు శాతం నాస్టాల్జియా కథలంటే, అలాంటి కథలు ఒక ఐదు ఈ సంకలనంలో తటస్థ పడ్డాయి. ఇవి భారత దేశం మే ప్రధాన నేపథ్యంగా రాసిన కథలు.

ఇక కథ చెప్పే విధానానికి వస్తే, రాసిన వారు ఎక్కువగా అంతర్యామి గొంతుసెంచుకొని, అన్నీ పాత్రల ఆలోచనలను, సంభాషణలు కథ చదివిన వారికి అందచేసే ప్రయత్నాలు చేసారు. అలాంటి రచన శైలి 32 కథలలో కనిపిస్తుంది. అలా కాకుండా పాత్రల ద్వారా కథ చెప్పించే ప్రయత్నం (ఫస్ట్ పర్సన్, థర్డ్ పర్సన్ నేరేషన్ - వ్యక్తిగతంగా, మూడో మనిషి దృక్పథం తో కథ చెప్పడం) ఈ కథలలో వెనుకంజే వేసిందని చెప్ప వచ్చు. ఇలాంటి ప్రయత్నాలు కథ రాయటంలో, పాత్రల చిత్రీకరణలో కూడా సంక్లిష్టత కల్పిస్తాయి. జాగ్రత్తగా రాయకపోతే, కథనే పేలవంగా అవ్వడానికి అవకాశాలు ఎక్కువ.

ఈ విషయం పై సాహితీ మిత్రులు స్పందిస్తూ, పాయింట్ ఆఫ్ వ్యూ కథను బట్టి ఉంటుందని, మంచి కథా రచయిత అన్ని దృక్కోణాల లోనూ కథ చక్కగా చెప్పగలడు అన్న అభిప్రాయం వెలి బుచ్చారు. ఉదాహరణకి మార్క్ ట్వైన్ 'టామ్ సాయర్ ' అంతర్యామి గొంతుతో చెప్తే, 'హకల్ బెర్రీ ఫిన్ ' స్వగతం లా రాశాడు. రెండూ గొప్ప రచనలే. కాబట్టి పాయింట్ ఆఫ్ వ్యూ కు అంత ప్రాముఖ్యత ఇవ్వనవ్వసరం లేదని, రచయిత కథను బట్టి తనే సరిగా ఎన్ను కో గలడని అభిప్రాయ పడ్డారు. కానీ అంతర్యామి గొంతులో పలికే సులువు, స్వాతంత్రము, మిగిలిన కథా విధానాలలో లేవని అంగీకరించారు.

అలానే, చాసో గారి "మాతృ ధర్మం", రావి శాస్త్రి గారి "పిపీలకం" కథలలో జంతువుల ద్వారా నీతి కథల మాధ్యం లో సమకాలీన సాంఘిక, ఆర్థిక సంఘర్షణలను చిత్రీకరించినట్లు, డయాస్పోరా కథా రచయితలు తమ కథలు చిత్రీకరించ

లేదు.  కొత్త తరహా గా కథ చెప్పాలని చేసే ప్రయోగాలు మందపాటి సత్యం లాంటి కొద్ది రచయితలు ఇదివరకే చేసినా, ఈ సంకలనంలో  అలాంటి కథలు ఎక్కువుగా కనపడవు. కానీ డయాస్పోరా కథలు చెప్పడంలో మిగిలిన కథలకంటే బిన్నంగా పోకడలు కనిపిస్తాయి అని ఆశిస్తే, అది ఆశాభంగమే అవ్వుతుంది.

ఇక కథ కాలం నిడివి తీసుకుంటే, ఎక్కువ భాగం (60% పైన) కథలు సంవత్సరాలు పాటు జరిగే సంఘటనల ఆధారంగా రాసిన కథలు. దీనివల్ల కథలకి కావలసిన పంచ్ మిస్ అయ్యిందని పిస్తుంది. అన్నీ మంచి కథలే అయినా, చదువరుని ఒక్క సారి ఉల్లిక్కి పడేలా చేసి, కల కాలం గుర్తుండి పోయేలా చేసే కథలు తక్కువే అనిపిస్తాయి.

ఇక కథా విషయానికి వస్తే, మొదటి సంకలనం లో విభజించి నట్లు, ఈ సంకలనం ఆంతరిక సమస్యలు , మరపురాని మన దేశం,  కొత్త అనుభవాలు,  కేవలం కల్పితం అని విభజించ ప్రయత్నిస్తే ఒక కొత్త ఇబ్బంది ఎదురవుతుంది. పూర్తిగా నాస్టాల్జియ(మరపు రాని మన దేశం) కథలంటూ లేవు. నాస్టాల్జియ కథలలో అంతర్లీనమై ఉంటుంది. ఆంతరిక సమస్యలు మరింత విస్తారమై, గృహ హింసలు, తరతరాల విభేదాలు మాత్రమే కాక కొత్త విషయాలు పరిచయం చేస్తాయి. కాల ప్రభావపు మార్పుల వల్ల ఒకప్పటి కొత్త అనుభవాలు, ఇప్పటి ఆంతరిక సమస్యలుగా మారటం మనం చూడ వచ్చు. ఇక కొత్త అనుభవాల క్రింద, వార్తల వల్ల తెలిసిన విషయాలు కథా వస్తువు గా మలుచుకోవడం కూడా కనిపిస్తాయి. కొన్ని కథావస్తువులు (ఫాంటసీ, సైకియాట్రిక్) డయాస్పోరా కథలని చెప్పలేము. ఆ కథలు ఎక్కడైనా వర్తిస్తాయి, భారత దేశంలో నుండి వలస రాకపోయినా ఈ కథలను రాయవచ్చు. కథ రాసిన వారు భారత దేశం నుంచి వలస వచ్చిన వారు కాబట్టి,  ఇలాంటి కథలకు డయాస్పోరా కథలుగా ఈ సంకలనంలో చోటు దొరికింది అని అనుకుంటున్నాను. ఇలాంటి కథల సంఖ్య తక్కువే.

తెలుగులో గొప్ప కథలుగా బాగా ప్రాచుర్యం పొందిన వాటితో పోలిస్తే,  కొట్టొచ్చినట్లు కనిపించే తేడా, డయాస్పోరా కథలు ఎక్కువగా ఒక నీటి బుడగ లో ఉండిన వారు రాసిన కథలుగా అనిపిస్తాయి. బయట ప్రపంచం చూచాయగా కనిపిస్తున్నా, చెప్తున్న కథలో అంతర్లీనంగా కనిపించవు. కొన్ని కథల లో కొద్దిగా ఈ ప్రయత్నం (ఇలాంటి ప్రయత్నం అమెరికా కథకుల నుండి  కాక ఆస్ట్రేలియా, ఆఫ్రికా నుంచి రాస్తున్న వారి కథలలో కనిపించడం గమనార్హం) కనిపించినా,  మిగిలిన కథలలో ఇది గైర్హాజరే. అలనాటి గురజాడ గారి కథ "మీ పేరేమిటి?(మత మౌఢ్యము) , కారా గారి "యజ్ఞం"(సాంఘిక/జాతి అసమానతలు) మహేంద్ర "బేసిన్ బ్రిడ్జి దగ్గర(కాలుష్యం)" కథల లో మన చుట్టూ ఉన్న సంఘం, పరిసరాలు కథలో భాగమై, కథను మరింత గొప్పగా, పది కాలాలు నిలిచిపోయేలా చేస్తాయి.

అధిక శాతం నీటి బుడగ లోని జీవిత కథలకి కారణం, భారతీయ డయాస్పోరా ప్రజల జీవన శైలి అని నా అభిప్రాయం. ప్రవాస దేశానికి వలస వచ్చి ఇక్కడ స్థిరపడ్డా, మొదటి తరం భారతీయులు తమకనే ఇక్కడో మిని ఇండియాలను సృష్టించేసుకున్నారు. కలిసి దగ్గర లోనే కొన్ని మంచి బడులున్న కమ్యూనిటీ లలో ఇళ్లు కొని స్థిరపడి, తమ కంటూ ఇండియన్ స్టోర్, తెలుగు సినిమాలు, తెలుగు బంధు మిత్రులు తో ఒక తెలుగు జీవిత బుడుగలు సృష్టించుకోవడం తో మన ప్రజలు తాము వలస వచ్చిన దేశ సంఘంలో పూర్తిగా ఇమడలేదనిపిస్తోంది. దాని వల్ల రచయితలు అందుబాటులో ఉన్న విలక్షణ మైన కథలు రాసే అవకాశాలను వదులుకున్నారని అనిపిస్తుంది. అంటుమొక్క సామీప్యత మరో సారి గుర్తుకొస్తుంది. పరాయి దేశం వచ్చి ఇక్కడ వేళ్ళు పాతుకున్నా, అంటుమొక్క లా పై కొమ్మలు భారత దేశం నుంచి వచ్చినవే కాబట్టి, ఈ చెట్లకు కాసే పూలకు, పండ్లకు ఇక్కడి దేశం కంటే, తెలుగు దేశ పోలికలే ఎక్కువ. వీరి కథలు కూడా మధ్య తరగతి వారి అనుభవాల మీదనే ఎక్కువగా ఉంటాయి.

ఇక సాహితీ మిత్రులు ఈ విషయంలో తెలుగులో గొప్ప కథలు గా పేరు తెచ్చుకోవడానికి కొన్ని కొత్త దృక్కోణాలు చూపెట్టారు. స్వాతంత్ర పోరాటం, నక్సల్ పోరాటం, శ్రీ శ్రీ మరో ప్రపంచం, సోవియట్ సాహిత్యాల వల్ల ఇలాంటి సంఘర్షణల ప్రభావానికి సంఘం బాగా గురి అయ్యింది, ఉత్తేజమైనది. తెలుగు కథా రచయితల కథలలో ఆ సంఘర్షణలు,  అంశాలు అంతర్లీనమై పోయాయి.  అలాంటి నేపథ్యానికి దూరమైన డయాస్పోరా కథలలో వాటిని పెద్దుక్కోవడం సరి కాదు అన్నారు మిత్రులు.  రచయితలు తమ పరిధిలో నుంచే కథలు రాస్తారు. కాబట్టి ప్రస్తుత డయాస్పోరా కథలు ఒక విధంగా ఈ పరిధి లు చెప్పకుండానే చెప్తాయి.

డయాస్పోరా కథలను చిత్ర రూపంలో విశ్లేషించడానికి కర్ట్ వొన్నే గాట్ ప్రతిపాదించిన కథా రూప చిత్రాల సిద్ధాంతాన్ని మరో పరిమాణం గా ఈ వ్యాసం కోసం ఎన్నుకున్నాను. కర్ట్ వొన్నే గాట్ తన పి హెచ్ డి కి ఈ సిద్ధాంతం ప్రతిపాదించినప్పుడు, యూనివర్సిటీ వాళ్ళు తిరస్కరించారు. కానీ కర్ట్ వొన్నే గాట్ ఆ సిద్ధాంతం కాలేజీలో క్రియేటివ్ రైటింగ్ విద్యార్థులకు చెప్పే వారు. నాకు ఈయన సిద్ధాంతం చదివిన తరువాత ప్రతీ కథ ఒక చిత్రం లా కనబడడం నచ్చడమే కాక ఆ కథ నాకు తెలిసిన మిగిలిన కథలతో పోల్చడం సులువైంది.

కర్ట్ వొన్నే గాట్ కథా చిత్రం కోసం మనం ఒక గ్రాఫ్ వేసుకోవాలి. ఈ గ్రాఫ్ కు Y అక్ష్యం (Y ఆక్సిస్) అదృష్టం పైన ఉంటే, దురదృష్టం కింద ఉంటుంది. అదృష్టం అంటే కథలో మంచి, సంతోషపు సంఘటనలు అన్నీ తీసుకోవచ్చు. అలానే చెడు, దుఃఖ సంఘటనలు దురదృష్టం గా తీసుకోవచ్చు. ఇక X అక్ష్యం (X ఆక్సిస్) కథ మొదలు, కథ అంతం గా రెండు కొనలు ఎంచుకోవచ్చు.

జగదేక వీరుడు లాటి ప్రేమ కథలు మనం ఈ గ్రాఫ్ లో గీస్తే, జగదేక వీరుడు దేవ కన్యలను కలిసి ప్రేమలో పడిన భాగం గ్రాఫ్ లో X అక్ష్యం సున్న నుండి ఒక అల లాగా పైకి లేస్తుంది (అనుబంధంలో గ్రాఫ్ లు చూడవచ్చు). తిరిగి దేవకన్యలను పోగొట్టుకోవడం తో ఈ గీత ఒక్క సారిగా పడిపోయి దురదృష్టం వైపు పయనిస్తుంది. కథ సుఖాంతం తో ఈ గీత మళ్లీ పైకి అదృష్టం వైపు పయనిస్తుంది. ఈ గ్రాఫ్ (చిత్రం -1 గీత -1) చూస్తే కథ ఆటు పొట్లు గ్రాఫ్ లో చక్కగా కనపడతాయి. చాలా మటుకు ప్రజాదరణ పొందిన కథల, సినిమాల గీతలు ఈ గ్రాఫ్ లాగా ఉంటాయి. అలానే సిండ్రెల్లా కథ తీసుకుంటే ఆ కథ చిత్రం క్రమంగా మెట్లు మెట్లు గా అదృష్టం వైపు ప్రాకడం, 12 గంటలు అయ్యిన వెంటనే దురదృష్టం వైపు ఒక్కసారి పడిపోవడం, తిరిగి రాకుమారుడు వరించడంతో అదృష్టం వైపు ఎగసి పోవడం గోచరిస్తుంది (చిత్రం-1 గీత - 2). హమ్లెట్ లాటి కథలలో ఆటు పోట్లు ఉండవు. కథ ఎటు వైపు మళ్లుతున్నదో చెప్పలేం. ఆ కథ గీత సాఫీగా గడిచిపోతుంది (చిత్రం1 గీత - 3).

పైన చెప్పిన కథల వరుసలోనే మన 46 డయాస్పోరా కథల గీతాలు గీస్తే, మనకు కొట్టొచ్చినట్టు కొన్ని విషయాలు తెలుస్తాయి. డయాస్పోరా కథలలో ఎక్కువగా ఆటు పోటు లేని సాఫీ గా పోయే కథలే. ఈ కథలలో కొస మెరుపులు తక్కువే. అలానే ఈ కథలు దురదృష్టం ఉన్న వైపే ఎక్కువగా కనిపిస్తాయి. డయాస్పోరా కథలలో ఆనందపు ఛాయలు బాగా తక్కువే. డయాస్పోరా కథల గ్రాఫ్ (చిత్రం-2) అనుబంధం లో చూడవచ్చు. ఈ చిత్రం వల్ల రచయితలకు మరిన్ని కొత్త ఆలోచనలు వచ్చి, ఇది వరకు రాయని కోణాలు , కొత్త కథ వస్తువులు పరిశోధించ గలరని ఒక ఆశ.

ఇక భవిష్యత్తు లోకి వస్తే,

డయాస్పోరా కథలలో ఆశిస్తున్న మార్పులు రెండో తరం రచయితలనుంచి ఎదురు చూడవచ్చు. ఈ రెండో తరం రచయితలు ఇక్కడే పుట్టిన వారు, లేకపోతే బాల్యంలోనే తల్లి తండ్రుల తో వలస వచ్చిన వారు. వారి పెంపకం వల్ల వారు ఈ సంఘంతో మొదటి తరం వారింకంటే బాగా కలిసిపోయారు. అందుకని వారి కథలు, వారి అనుభవాల వల్ల మరింత గొప్పగా ఉంటాయి అని ఒక ఆశావాదం. 'కాని రెండో తరం వాళ్ళు తెలుగు నేర్చుకొని, తెలుగు రాస్తారా, నీ అత్యాశ కానీ !' అని నిరాశావాది తన గళం విప్పడం వినిపిస్తూనే ఉంటుంది. మూడో తరం వారు నుంచి తెలుగు కథలు ఆశించడం కష్టమే. ఇప్పుడు పిల్లలు చేసుకుంటున్న వివాహాలు, ఎంచుకున్న జీవన శైలి వల్ల మూడో తరం వచ్చే సరికి వారు మెయిన్ స్ట్రీమ్ అమెరికన్లు గా మారిపోతారు. అందువల్ల నేను ఇది వరకు రాసిన వ్యాసంలో ప్రస్తావించిన ఇటాలియన్, ఫ్రెంచ్ రచయితల లాగా ఇంగ్లీష్ లోనే వారు వారి రచనా వ్యాసంగం కొనసాగిస్తారు. మొత్తం కథలో, ఎక్కడో తెలుగు వాసనలు గుబాలిస్తే, అది ఆశ్చర్యమే.

మరో విధంగా, ఇప్పుడు కృత్రిమ మేధస్సు(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) లాంటి వాటిలో వస్తున్న మార్పులు చూస్తుంటే కథ భాషాభిమానం కి దినాలు దగ్గిర పడ్డాయని అనిపిస్తుంది. ఏ భాషలో రాసినా, టెక్నాలజీ వల్ల ఆ కథను పాఠకుడి భాషలోనే ఒక గొప్ప కథగా మల్చడమే కాక, ప్రపంచంలో కావాల్సిన మరే భాషలో కూడా క్షణాలలో ఆ కథను తిరుగ రాసేయవచ్చు.

ఇవన్నీ జరగడానికి ఇంకా సమయం ఉంది. కానీ ప్రస్తుతం మొదటి తరం రచనా వ్యాసంగం చేసే వారికి, కథా వస్తువులకు ఏమాత్రం కొదువలేదు. కాదంటే మరింత గొప్ప కథలకు వారు తమ చుట్టూ కట్టుకున్న బుడుగ వాతావరణం నుండి బయట పడాలి, కథ శిల్పం మార్పులతో మరింత అందంగా కథలు చెప్పే ప్రయత్నం చేయాలి.

***

అనుబంధం

| కథ సందేశం | కథల సంఖ్య |
|---|---|
| కొత్త అనుభవాలు | 12 |
| బాంధవ్యాలు | 12 |
| అస్తిత్వం | 7 |
| వార్తలు, వాస్తవ ఘటనలు | 6 |
| మనో వైజ్ఞానిక అంశాలు | 3 |
| గృహ హింసలు | 3 |
| తరతరాల అంతరాలు | 2 |
| సామాజిక అసమానతలు | 1 |
| మొత్తం | **46** |

| కథ నేపథ్య దేశం | కథల సంఖ్య |
|---|---|
| అమెరికా సంయుక్త రాష్ట్రాలు | 24 |
| భారత దేశం | 5 |
| కెనడా | 4 |
| ఆస్ట్రేలియా | 2 |
| మధ్య/దక్షిణ అమెరికా దేశాలు | 1 |
| దక్షిణ ఆఫ్రిక | 1 |
| ఇంగ్లాండ్ | 1 |
| ఐర్లాండ్ | 1 |
| సింగపూర్ | 1 |
| మలేషియా | 1 |
| శ్రీలంక | 1 |
| ఎక్కడైనా | 4 |
| మొత్తం | **46** |

| | |
|---|---|
| నాస్టాల్జియా ఛాయలు ఉన్న కథలు | **17 (37%)** |
| | |
| ఫాంటసీ/ వ్యంగ్యం/ హాస్యం | **7(15%)** |
| | |
| అంతర్యామి గొంతు | **32(70%)** |
| | |
| కథాకాలం తక్కువ పరిధి | **17 (37%)** |

## కర్ట్ వొన్నేగాట్ కథా చిత్రాలు




**చిత్రం # 1**




**చిత్రం # 2**